

ఇంకా ఏపీ ఆన్‌లైనే!

తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటినా పోస్టల్‌శాఖ బయోమెట్రిక్ యంత్రాల్లో రాష్ట్రం పేరు ఏపీఆన్‌లైన్ అనే కనిపిస్తోంది. గ్రామాల్లో సామాజిక ఫించన్లను పంపిణీ చేయడానికి వినియోగించే బయోమెట్రిక్ యంత్రాల్లో ఇప్పటికీ ఏపీ ఆన్‌లైన్‌గానే చూపడం విమర్శలకు తావిస్తోంది.
నారాయణఖేడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఉత్సాహంగా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

క్రమశిక్షణకు మారుపేరు పోలీసుశాఖ
అంకితభావంతో పనిచేసి మెప్పు పొందండి
మహిళా భద్రతా విభాగం డీఐజీ రాజేశ్వరి

7


కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న డీఐజీ రాజేశ్వరి

గాంధీభవన్‌కు పటాన్‌చెరు పంచాయితీ

నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గపోరు
ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై నాయకుల అసంతృప్తి
డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదులు
చిచ్చుపెట్టిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు!




పటాన్‌చెరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గపోరు గాంధీభవన్‌కు చేరింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గ కాంగ్రెస్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గత పదేళ్లలో నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను అనేక ఇబ్బందులు పెట్టిన ఆయన రావడంతో పార్టీ కేడర్ ఉసూరుమంది. ఈక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ గురువారం తన అనుచరులతో గాంధీభవన్‌కు చేరుకుని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో పాటు పాలనాపరమైన అంశాలలో తన పట్టు పెరగేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు సమాచారం. వెంటనే నియోజకవర్గంలో పోలీసుశాఖలో జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ఇది ఇరువర్గాల మధ్య చిచ్చురేపినట్టు తెలుస్తోంది. పెరుగుతున్న ఎమ్మెల్యే ప్రాబల్యానికి చెక్కు పెట్టేందుకు శ్రీనివాస్ తన అనుచరులతో అధిష్టానానికి ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు బహిర్గతమైంది.

ఎమ్మెల్యే చేరికతో చిచ్చు

మూడుసార్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి వైరివర్గాలుగా ఉన్న కాట శ్రీనివాస్‌గౌడ్ గ్రూపుకు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఏర్పడ్డాయి. పార్టీ ఆదేశాలమేరకు నిర్వహించిన కార్యక్రమాలలో ఇంతవరకు ఇద్దరు నాయకులు కలిసి కనిపించలేదు. జిల్లా మంత్రి దామోదర్‌రాజనర్సింహ ప్రధాన అనుచరుడిగా ఉన్న కాటశ్రీనివాస్‌గౌడ్ తన రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే ప్రాబల్యం పెరగడంపై కాట వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజుల్లో కాట శ్రీనివాస్ మాటే చెల్లుబాటు అయింది. ఆయన సూచించిన వారికే పోస్టింగ్‌లు ఇవ్వడంతో ఎమ్మెల్యేగా ఓటమిపాలైనా ఆ స్థాయిలో చక్రం తిప్పే అందడండలో ప్రభుత్వం ఇవ్వడంతో హవా కొనసాగింది. ఎమ్మెల్యే చేరిక తరువాత క్రమంగా ఆయన ప్రాబల్యం తగ్గుతూ రావడంతో జీర్ణించుకోలేక పోయారు. శ్రీనివాస్ ఫిర్యాదు నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు ఇరువర్గాలకు సంధి చేకూర్చేందుకు రాజీ ఫార్ములాను రూపొందిస్తున్నారని తెలిసింది. జిల్లా మంత్రి దామోదర్‌రాజనర్సింహ, జగ్గారెడ్డి సూచనల మేరకు పటాన్‌చెరు కాంగ్రెస్‌లో నెలకొన్న గ్రూపు తగాదాలకు స్వస్తి పలకాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గ్రూపువిబేధాల ప్రభావం వచ్చే స్థానిక సంస్థలపై పడుతుందని పార్టీ క్యాడర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో ఈ వ్యవహారాన్ని తేల్చేస్తామని శ్రీనివాస్‌గౌడ్‌కు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడమే ఎమ్మెల్యే లక్ష్యం : కాటశ్రీనివాస్‌గౌడ్

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను ఎమ్మెల్యే గూడెంమహిపాల్ రెడ్డి అనేక ఇబ్బందుల పాలు చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా తమ కష్టాలు తీరలేదని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బట్టివిక్రమార్క, మహేష్‌కుమార్‌గౌడ్‌లకు ఫిర్యాదులు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు బనాయించి వేధించిన వారికే ఎమ్మెల్యే పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నాడని మండిపడ్డారు. అసలు ఆయన కాంగ్రెస్‌లో ఉన్నారా లేదా అన్నదానిపై స్పష్టత లేదని విమర్శించారు. కాంగ్రెస్‌ను భూస్థాపింతం చేసేందుకే ఆయన బీఆర్ఎస్ నుంచి వచ్చారని విమర్శించారు.

చరిత్ర.. చెక్కు చెదురుతోంది..

అందోలు చుట్టూ ఆనాడే కోటగోడ
మూడు వైపులా ప్రవేశానికి గౌనిలు
పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు..

7

ఎరువుల మోత

- యాసంగిలో పెరిగిన ధరలు
- బస్తాకు రూ.100 పెంపు
- మెదక్ జిల్లాలో అన్నదాతలపై రూ. 9 కోట్ల అదనపు భారం



మెదక్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అసలే వానాకాలం పంట దిగుబడులు తగ్గడంతో నష్టపోయిన రైతన్నకు.. పెరిగిన ఎరువుల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. పెట్టుబడి పెరిగిపోయి వ్యవసాయం భారంగా మారుతోంది. పంటల సాగులో అధికంగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. వానాకాలం సీజన్‌తో పోల్చితే యాసంగి సీజన్ వచ్చే సరికి ధరలు గణనీయంగా పెరిగిపోయాయి. జిల్లాలో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ఇందుకోసం వినియోగించే 20-20-013, 14-35-15, 24-24-0 తదితర కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగిపోయాయి. ఎరువుల ఉత్పత్తికి వినియోగించే ముడిపదార్థాల ధరలు పెరగడంతో ఎరువుల ధరలు పెరిగినట్లు డీలర్లు చెబుతున్నారు. దీంతో పంట సాగు ఖర్చు ఎకరాకు రూ 3వేల వరకు పెరుగుతుందని రైతులు వాపోతున్నారు.

యూరియా మినహా అన్నీ..

యూరియా మినహా అన్నిరకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగాయి. మొన్నటి వరకు 20-20-013 కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1,200 ఉండగా ప్రస్తుతం రూ.1,300కు చేరింది. డీఏపీ బస్తా ప్రస్తుతం రూ.1,350కు లభిస్తోంది. డీఏపీ ధరలు పెరగలేదు. యూరియా బస్తా రూ.267కు లభిస్తున్నది. ఈ యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 2.90 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం 20,590 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 1,680 మెట్రిక్ టన్నులు డీఏపీ, 24,000 మెట్రిక్ టన్నులు యూరియా అవసరమవుతాయని ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా జిల్లా రైతులపై రూ.9 కోట్లు అదనంగా భారం పడుతోంది.

పెట్టుబడి భారం పెరిగింది

ఇప్పటికే వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిని నేపథ్యంలో ఎరువుల ధరలు కూడా పెంచడం సరికాదు. పంట దిగుబడి కోసం రసాయన ఎరువుల వాడకం తప్పనిసరి కావడంతో ఎంత ధర వెచ్చించైనా రైతులు కొనుగోలు చేయాల్సిందే. ఇదేఅదనుగా ఎరువుల ధరలను పెంచుతున్నారు.
-వెంకటి, తొగుట

అబ్బురపరిచేలా..

- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన షురూ
- ఆలోచింపజేసేలా విద్యార్థుల ఎగ్జిబిట్లు
- ప్రారంభించిన సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
- సైన్స్‌పై పట్టు సాధించాలి : కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన కార్యక్రమం గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జ్యోతి ప్రజ్వలన చేసి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. అర్థం చేసుకొని చదవాలని బట్టీపట్టరాదన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన చూస్తుంటే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కనిపిస్తున్నదన్నారు. జిల్లావ్యాప్తంగా 545 పాఠశాలల నుంచి సుమారు 750 ఎగ్జిబిట్లు, 95 ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శలన ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన

మిగతా 8వ పేజీలో..


విద్యార్థి తయారు చేసిన ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి


అంకిత్ కుమార్, జడ్పీహెచ్ఎస్, ఇస్నాపూర్ (గైడ్ టీచర్ : భాస్కర్ దేశి)

రైతుల కోసం 'ఈ-లైఫ్‌సేవర్' స్టిక్

రైతులు పొలాల్లో నడిచేటప్పుడు విషకీటకాలు, పాములు కాటేసే అవకాశముంది. వాటి నుంచి కాపాడుకోవడానికి ఈ-లైఫ్‌సేవర్‌స్టిక్ ప్రాజెక్టును రూపొందించారు. రెండు మీటర్ల పొడవు పీవీసీ పైప్, ఒక వైబ్రేటింగ్ మోటార్, చిన్న సోలార్ ప్యానల్, స్విచ్లు, వైర్లతో తయారు చేశారు. ఫస్ట్‌ఎయిడ్ కిట్, పాము కాటేసినప్పుడు తీసుకోవాల్సిన ఆయుర్వేదిక్ మందులు ఈ పరికరంలో ఉంటాయి. ముందుగా పీవీసీ పైప్ ఒక చివరలో వైబ్రేటింగ్ మోటార్‌ను అమర్చి దానిని బ్యాటరీకి కనెక్ట్ చేస్తారు. బ్యాటరీని రీచార్జ్ చేయడానికి సోలార్ ప్యానల్స్ అటాచ్ చేశారు. పైప్ కింది భాగంలో వెలుతురు రావడానికి ఎల్ఈడీ బల్బును కూడా అమర్చారు. అయితే రాత్రి పూట రైతులు బయటకు వెళ్లినప్పుడు ఈ స్టిక్ తీసుకొని వెళ్తున్నట్లయితే వారికి ఒక టార్చ్ లైట్ లాగా పనిచేస్తుంది. గడ్డిలో నడుస్తున్నపుడు ఆ వైబ్రేటింగ్ మోటార్‌ని కూడా ఆన్‌చేస్తే కనీసం ఆరు మీటర్ల దూరం వరకు వైబ్రేషన్ వస్తుంది. దీంతో పాములు, క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. ఈ ప్రయోగం చేసేందుకు రూ.500 ఖర్చయింది.


పట్టుపడిన పౌడర్‌ను చూపిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దాబాలో మత్తు దందా..

హెరాయిన్ తయారీకి ఉపయోగించే పౌడర్ స్వాధీనం

మాసాయిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై ఉన్న ఓ దాబాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టీం గురువారం దాడి చేసి హెరాయిన్ తయారీలో వినియోగించే 128 గ్రాముల పౌడర్‌ను స్వాధీనం చేసుకుంది. దాబా మేనేజర్ రవీందర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల కథనం ప్రకారం.. మాసాయిపేట వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న షేర్-ఏ-పంజాబీ ఫ్యామిలీ దాబాపై గురువారం సాయంత్రం మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందం దాడులు నిర్వహించింది. దాబాలో నిల్వ ఉంచిన హెరాయిన్ తయారీలో వినియోగించే 128 గ్రాముల పౌడర్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ దాడుల్లో మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టీం సీఐ పి.వీణారెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, ఆజం, గోపాల్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

పోలీస్‌స్టేషన్ ఎదుట గిరిజనుల ఆందోళన
చనిపోయిన వ్యక్తిపై
ఎఫ్ఐఆర్ ఘటనలో బాధితులు

7లో

మాకొద్దీ గ్యాస్ పరిశ్రమ..

పనులు నిలిపివేయాలని గ్రామస్థుల ఆందోళన


గ్యాస్ పరిశ్రమ పనులు నిలిపివేయాలని ఆందోళన చేస్తున్న మద్రి గ్రామస్థులు

కోహీర్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలం మద్రిలో టొరెంట్ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పనులు నిలిపివేయాలని గురువారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పొలాల మధ్య గ్యాస్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే వ్యవసాయ పనులు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ప్రధాన రహదారి పక్కనే గ్యాస్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని పేర్కొన్నారు.

గ్రామసభ తీర్మానం పట్టించుకోరా?

గ్యాస్ పరిశ్రమ వద్దని 2022 సెప్టెంబర్ 30న సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు ఏకగ్రీవంగా ఆర్డీవో సమక్షంలో తీర్మానం చేశామని వారు తెలిపారు. ఏకగ్రీవంగా తీర్మానం చేసి లిఖితపూర్వకంగా అధికారులకు ఇచ్చామని పేర్కొన్నారు. అప్పట్లో పనులు నిలిపివేసిన అధికారులు మళ్లీ పారంభించారని ఆరోపించారు.

గ్రామం మీదుగా పైప్‌లైన్ వద్దు

మద్రి గ్రామం అవతల వైపు ఉన్న గ్యాస్ ప్రధాన పైప్‌లైన్ వాల్ నుంచి మద్రి గ్రామం మీదుగా గ్రామ శివారులో చేపడుతున్న గ్యాస్ పరిశ్రమ వరకు పైప్‌లైన్ వేసేందుకు ప్రయత్నించడం తగదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామం మధ్య నుంచి గ్యాస్ పైప్ లైన్ వేస్తే జరగరాని సంఘటన ఏదైనా జరిగితే గ్రామం మొత్తం తగలబడి పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పదించి తమ గ్రామ పరిధిలో గ్యాస్ పరిశ్రమ పనులు నిలిపి వేయాలని కోరారు.

పోలీసుల పహారాలో పనులు!

ఎట్టి పరిస్థితుల్లో గ్యాస్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టినా పరిశ్రమ యాజమాన్యం మాత్రం పనులు యథావిధిగా కొనసాగిస్తున్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆందోళన చేసినప్పుడు పనులు నిలిపి వేసి.. గ్రామస్థులు వెళ్లిపోయిన తర్వాత పోలీసుల సహాయంతో రాత్రిపూట పనులు ప్రారంభించినట్లు మండిపడ్డారు. పనులు చేపట్టేందుకు పోలీసులు పరిశ్రమ యాజమాన్యానికి సహకరించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

బస్తాకు 3 కిలోలు తరుగు!

- వడ్ల కొనుగోలులో మోసం
- బట్టబయలు చేసిన రైతులు
- రెడ్డిపలి కొనుగోలు కేంద్రంలో ఘటన


రెడ్డిపల్లిలోధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

అల్లాదుర్గం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయాలలో ఇబ్బందులకు గురికావద్దన్న సదుద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ, కొందరు నిర్వాహకులు స్వార్థంతో రైతులను నట్టేటముంచుతున్నారు. తూకంలో మోసం చేస్తూ బస్తాకు ఏకంగా 3 కిలోల ధాన్యంను అదనంగా నింపుతుండటంతో రైతులు ఉసూరుమంటున్నారు. అనుమానం వచ్చిన రైతులు నిఘాపెట్టి బండారాన్ని బట్టబయలు చేసిన సంఘటన గురువారం అల్లాదుర్గం మండలం రెడ్డిపల్లి గ్రామంలో వెలుగు చూసింది. రైతుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం తూకం ప్రారంభించారు. నిబంధనల ప్రకారం ప్రతీ బస్తాలో 42 కిలోల 300 గ్రాముల ధాన్యాన్ని నింపాల్సి ఉంటుంది. ఈ కేంద్రం నుంచి ఈ నెల 20న 727 బస్తాలతో ఒక లారీ పెద్దశంకరంపేటలోని రైసుమిల్లుకు వెళ్లింది. అక్కడ తూకం వేయగా తేడా రావడంతో మిల్లు యజమానులు ఈ విసయం రైతులకు చెప్పారు. అనుమానం రావడంతో గురువారం కొందు రైతులు కొనుగోలు కేంద్రంలోని తూకంపై నిఘా ఉంచారు. తూకం వేసిన బస్తాలను తిరిగి కాంటా చేయించారు. కొన్ని బస్తాలు 44 కిలోల నుంచి 46 కిలోల వరకు బరువు తూగాయి. దీంతో రైతులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేశారు.

విద్యారంగాన్ని చిన్నచూపు చూడటం తగదు

చేర్యాల, నవంబరు 21: ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూడడం తగదని ఏఐఎస్ఎఫ్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చేర్యాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాలకు ఉన్న డబ్బులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలకు లేవా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శిరీష, ఎద్దు కార్తీక్, పోతుగంటి సాయికిరణ్ ఉన్నారు.


చేర్యాలలోని ఓ కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న నాయకులు

పత్తి తీసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి తీసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పత్తి తీసే రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పత్తిరకాలు దఫాదఫాలుగా పంట పూతకు రావడం వల్ల కనీసం మూడు నుంచి నాలుగు సార్లు పత్తిని తీయవలసి ఉంటుందని, రైతులు వేసే పత్తి రకాలను బట్టి తీసే సమయం ఆధారపడి ఉంటుందన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు.


జగదేవ్‌పూర్: పత్తి తీస్తున్న మహిళా రైతులు

● దౌల్తాబాద్: ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోస పోవొద్దని దౌల్తాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి సాయికిరణ్ అన్నారు. ఏవో, ఏఈవోలు గురువారం మండలంలోని తిర్మలాపూర్, లింగారాజుపల్లి, దౌల్తాబాద్, మల్లేశంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తేమను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు పడాల రాములు, ఏఈవోలు సంతోష్‌కుమార్, శిరీష, రాంప్రసాద్, రైతులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ఆదర్శ పాఠశాలను మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గ ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లాంగ్‌జంప్ పిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంవో మంజరి, రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్స్ కాట స్లీవరాజు, రాము, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


పాఠశాలలో లాంగ్ జంప్ పిచ్‌ను ప్రారంభిస్తున్న ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గప్రసాద్

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన నలుగురికి జరిమానా

బెజ్జంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన నలుగురికి హుస్నాబాద్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణాతేజ్ రూ. 15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని ముత్తన్నపేటకు చెందిన ఓ మహిళతో ముత్తన్నపేటకు చెందిన కనగండ్ల సురేందర్, మచ్చ కుమార్, చీలాపూర్‌కు చెందిన శానగొండ శరత్, బెజ్జంకి ఎక్స్ రోడ్డుకు చెందిన మ్యాకల శ్రీకాంత్ అసభ్యంగా ప్రవర్తించారు. సదరు మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 2017లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు విచారణ జరుగుతున్నది. విచారణలో భాగంగా గురువారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన హుస్నాబాద్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణాతేజ్ వారికి రూ. 15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు సిద్దిపేట విద్యార్థినులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిమెదక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో కె. పూజిత, జి. హారిక, జె. పూజ, ఎల్. శృతి, పి. ఉమామహేశ్వరి, జి. కృష్ణవేణి బంగారు పతకాలు సాధించారు. ద్వితీయ స్థానంలో కె. సైనా, యూ. అశ్విక, బుష్రా ఫాతిమా, సోఫియా, డి. అనూష, కె. రేఖ, జె. జ్యోతి, ఈ. అనూష సిల్వర్ పతకాలు సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ సుజాత తెలిపారు. వీరంతా రాష్ట్రస్థాయిలో పోటీ పడుతారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు నీలకంటి మనోహర్, అధ్యాపక బృందం అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపక బృందం



రంగనాయకుల ఆలయం వద్ద నేటికీ ఠీవిగా నిలిచిన పశ్చిమ ద్వారం



పట్టణం చుట్టూ నిర్మించిన కోట గోడలు శిథిలంగా మారిన దృశ్యం



ఉత్తర ఈశాన్యంలో నిర్మించిన మహాద్వారం



దక్షిణ భాగంలో నిర్మించిన మహా ద్వారం



చరిత్ర.. చెక్కు చెదురుతోంది..

అందోలు చుట్టూ ఆనాడే కోటగోడ

మూడు వైపులా ప్రవేశానికి గౌనిలు

పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు..

జోగిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అందోలు.. అభివృద్ధి పథంలో ఎన్ని మార్పులు వచ్చినా.. ఇదో చారిత్రక పట్టణం. రెడ్డి రాజుల కాలంలో సంస్థానంగా ఓ వెలుగు వెలిగిన ఈ పట్టణం నేటికీ చరిత్రకు ఆనవాలుగా మిగిలి ఉంది. అయితే, నాటి చరిత్రను, అప్పటి కట్టడాలను కాపాడి భావి తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ఉండగా, ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి.

అందోలును శత్రు దుర్భేద్యంగా మార్చేందుకు నాటి రెడ్డి రాజులు పట్టణం చుట్టూ కోట గోడ కట్టారు. పట్టణంలోనికి ప్రవేశించేందుకు మూడు వైపులా నిర్మించిన బురుజులతో కూడిన గౌనిలు నాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పట్టణం చుట్టూ సుమారు 30 అడుగుల ఎత్తులో కోట గోడ నిర్మించగా, పట్టణానికి ఈశాన్యంలో కొట్టాలకు వెళ్లే మార్గంలో ఒకటి, రంగనాథాలయానికి చేరే విధంగా పశ్చిమాన మరొకటి, దక్షిణాల ఇంకో గౌని ఇప్పటికీ కనిపిస్తాయి.

అప్పట్లో వీటికి ఏర్పాటు చేసిన తలుపులు ఏనుగులు కూడా విరగ్గొట్ట లేకపోయేవని చెబుతారు. కోట గోడ ఎక్కేందుకు కూడా వీలు లేకుండా గోడ చుట్టూ సుమారు ఆరు అడుగుల మేర కందకమూ నిర్మించి, అందులో నీటిని వదిలేవారని చెబుతారు.

శిథిలావస్థకు..

అందోల్ రక్షణగా కట్టిన నాటి గోడ శిథిలమై ఆనవాళ్లు లేకుండా పోతోంది. ప్రస్తుతం ఈ గోడ కూలడానికి సిద్ధంగా ఉంది. పట్టణం మధ్యలోని సిద్ధిమహల్‌గా పిలుచుకునే అంతఃపురం ఇప్పుడు కనిపించకుండా పోయింది. ఇక గౌనీలు సైతం శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈశాన్యం, దక్షిణ భాగాల్లోని గౌనీలు ఇంకా ఉన్నా..వాటిపై చెట్లు మొలిచి.. శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, పురావస్తు శాఖ అధికారులు స్పందించి ఈ చరిత్ర సాక్ష్యాలను కాపాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు కోరుతున్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

భూమికి బదులు భూమి ఇవ్వాలి

గౌరవెల్లి కింద భూములు కోల్పోతున్న రైతులు

అక్కన్నపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి భూములు కోల్పోతున్న వారికి భూములు బదులుగా భూములు ఇవ్వాలని రైతులు కోరారు. గురువారం అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామపంచాయతీ ఆవరణలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కింద భూములు కోల్పోతున్న రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు హాజరైన హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి మాట్లాడుతూ అంతకపేట గ్రామంలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ నిర్మాణానికి 5.01 ఎకరాల భూమి సేకరిస్తున్నామని తెలిపారు. కాలువ నిర్మాణానికి తీసుకునే భూములకు మార్కెట్ విలువకు మూడింతలు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని చెప్పారు. భూములకు బదులు భూములు ఇవ్వడం కుదరదని రైతులకు సర్ది చెప్పారు. గ్రామసభలో తహసీల్దార్ అనంతరెడ్డి, ఇరిగేషన్ డీఈ కరుణ, నాయబ్ తహసీల్దార్ అరవింద్, ఆర్ఐ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆప్తాల్మిక్, ఇమేజింగ్ అభ్యర్థులకు నేడు-రేపు కౌన్సెలింగ్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అప్లికేషన్స్ పెట్టుకున్న అభ్యర్థులకు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.సుధామాధురి ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ అప్లికేషన్స్ పెట్టుకున్న అభ్యర్థులకు ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సర్టిఫికేట్ లేకుంటే అడ్మిషన్ తిరస్కరించనన్నట్లు ఆమె తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు పోలీసు శాఖ

అంకితభావంతో పనిచేసి మెప్పు పొందండి

మహిళా భద్రతా విభాగం డీఐజీ రాజేశ్వరి

సంగారెడ్డి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ క్రమశిక్షణకు మారుపేరని, అలాంటి శాఖలో పని చేస్తున్న వారు మంచి ప్రవర్తనతో ప్రజలకు సేవ చేయాలని మహిళా భద్రతా విభాగం డీఐజీ ఆర్.రాజేశ్వరి అన్నారు. కంది మండలం చిద్రుప్పలోని పోలీసు శిక్షణా కేంద్రంలో 224 మంది పోలీసు కానిస్టేబుళ్లు గురువారం శిక్షణ ముగించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి ఉన్నతాధికారుల, ప్రజల మెప్పు పొందాలని సూచించారు. నిరంతర అభ్యాసం తోనే జ్ఞానాన్ని పొందుతామని, ఈ శిక్షణా కాలంలో నేర్చుకున్న విషయాలను నిరంతరం నెమరేసుకుంటూ కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. సంగారెడ్డి జిల్లాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణను పూర్తి చేసుకున్న శిక్షణా పోలీసు కానిస్టేబుళ్లందరికీ తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు సేవ చేయడానికి పోలీస్ శాఖ ఒక చక్కటి అవకాశం అని, మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులలో పోలీసు శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటుందన్నారు. మహిళల భద్రతకు, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. ఎన్నో పండుగలు, ఉత్సవాలు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నామంటే అందుకు కారణం పోలీసు శాఖ అన్నారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో అంకితభావంతో పనిచేసి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. హైదరాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 224 మంది కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ కోసం చిద్రుప్ప పోలీసు శిక్షణా కేంద్రానికి వచ్చారని, వీరందరికీ నూతన చట్టాలతో పాటు నేర విచారణ, ఇంటెలిజెన్స్, ఇంటర్నల్ సెక్యూరిటీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర విషయాల గురించి నేర్పించడం జరిగిందన్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజలలో వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సంఘ విద్రోహ శక్తులకు ఎదురు నిలబడి సామాన్య ప్రజలలో ఒక భరోసా కలిపిస్తుందని అన్నారు. అంతకుముందు శిక్షణా కానిస్టేబుళ్ల నుంచి డీఐజీ రాజేశ్వరి, కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌లు గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి డీఐజీ రాజేశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, డీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావ్, వైస్ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. పరేడ్‌కు శిక్షణా కానిస్టేబుల్ బాలకృష్ణ కమాండర్‌గా వ్యవహరించారు.



శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పరేడ్



పరేడ్ కమాండర్ బాలకృష్ణకు బహుమతి అందజేస్తున్న డీఐజీ రాజేశ్వరి, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్

ఒకే కుటుంబం నుంచి ముగ్గురు..

కల్హేర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూరుమూల గిరిజన తండాలో జన్మించిన ముగ్గురు యువకులు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని గురువారం పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి కొత్తకుంట తండాకు చెందిన వీరు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. తండాకు చెందిన దేవసోత్ దేవిజ్యానాయక్, వాలీబాయి దంపతుల ఇద్దరు కుమారులు విఠల్, వెంకటేష్‌తోపాటు దేవిజ్యానాయక్ తమ్ముడు చంద్యానాయక్ కుమారుడు హర్షవర్ధన్‌లు ఈ ఘనత సాధించారు. ఈ ముగ్గురు గురువారం శిక్షణ పూర్తి చేసుకుని నల్గొండలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు.



పాసింగ్ అవుట్ పరేడ్‌లో అన్నదమ్ములు విటల్, వెంకటేష్

న్యాయం చేయండి..

- పోలీస్‌స్టేషన్ ఎదుట గిరిజనుల ఆందోళన
- చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ ఘటనలో బాధితులు



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో కేసు నమోదైన వారితో పాటు వారి కుటుంబీకులకు న్యాయం చేయాలని గిరిజనులు గురువారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలోని వనాయణపూర్ పంచాయతీ పరిధిలో ఓ భూ వివాదంలో శ్రీనివాస్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు గిరిజనులపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అందులో ఒకరు మృతి చెందగా, ఈ విషయమై జిల్లా ఎస్పీతోపాటు సీఐ, ఎస్ఐలు కూడా వివరణ ఇవ్వాల్సి వచ్చింది. అయితే ఫిర్యాదు చేసిన శ్రీనివాస్‌పై కూడా తాము ఫిర్యాదు చేయగా, వారిపై కేసు నమోదు చేయలేదని ఎఫ్ఐఆర్‌తో దేవిసింగ్, ఆంజనేయులు, సూర్యలు తమ కుటుంబాలతో కలిసి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. చనిపోయిన వ్యక్తి పేరు ఎఫ్ఐఆర్‌లో రాసిన విషయాన్ని పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. అయితే, ఈ విషయం బయటపడకుండా పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని 'అనుమతి లేకుండా నిరసన తెలపడం తగదు' అంటూ వారిని పంపించే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని బయట ఎవరికీ చెప్పవద్దని వారిని సూచించినట్లు సమాచారం. కానీ, విషయం సాయంత్రానికి బయటపడింది.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



జహీరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో దోషిగా తేలిన ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీచంద్ర గురువారం తీర్పు వెలువరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన పవార్ రాజు మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా నీలం పట్టణానికి చెందిన పవార్ శ్రీకాంత్ వద్ద రూ.10వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించాలని శ్రీకాంత్.. పవర్ రాజుపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు 2024 ఆగస్టులో జహీరాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన పవర్ రాజును హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చనిపోయాడు. అతని తల్లి పవార్ గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ సీఐ రాజు, ఎస్ఐ శ్రీకాంత్‌లు కేసు దర్యాప్తు చేశారు. నిందితుడు పవార్ శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం తుది విచారణ జరగింది. పూర్వపరాలు పరిశీలించిన జిల్లా న్యాయాధికారి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన సీఐ రాజు, ఎస్ఐ శ్రీకాంత్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, ప్రస్తుత పట్టణ ఎస్ఐ కాశీనాత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ తదితరులను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించి రివార్డులను ప్రకటించారు.

జహీరాబాద్‌లో వ్యక్తి హత్య

తలపై బండరాయితో మోది..

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానం వెనుక భాగంలో రైల్వే ట్రాక్ వద్ద 35-40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తిని బుధవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. అతడి తలపై బండరాయితో కొట్టి చంపేసినట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. విషయాన్ని తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ శివలింగంలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాలను రప్పించినప్పటికీ ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్య ఎందుకు జరిగింది. ఎవరు చేశారు. అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి సబంధించి సమాచారం ఉంటే పట్టణ పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

ప్రాణాలు తీసిన విద్యుత్ కంచె

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

ఝరాసంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలానికి అక్రమంగా వేసిన విద్యుత్ కంచె ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. దారిన వెళ్తున్న వ్యక్తి దాహార్తి తీర్చుకునేందుకు వెళ్లగా.. కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చీలమామిడి శివారులో గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. దేవరంపల్లి గ్రామానికి చెందిన నసీర్(42) గ్రామంలో వ్యవసాయం చేస్తుంటాడు. గురువారం పని మీద చీలమామిడి శివారులోకి రాగా, దాహం వేసింది. రోడ్డు పక్కన ఓ పొలంలో దాహం తీర్చుకునేందుకు వెళ్లాడు. అయితే, ఆ పొలాన్ని పందుల నుంచి రక్షణ కల్పించేందుకు రైతు పొలం చుట్టూ ఇనుక కంచె ఏర్పాటు చేసి, విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. విషయం తెలియన నసీర్ అటుగా వెళ్లడంతో షాక్ తగిలి చనిపోయాడు. నసీర్ కుమారుడు అఫ్రోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



రేగోడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేగోడ్ మండలం చౌదరిపల్లిలో ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్.ఐ పోచయ్య గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన బాస్కా శ్రావణి (20) ఈ నెల 8 నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి సాయిలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



చలికాలం.. గుండె పదిలం

అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



సిద్దిపేట అర్బన్/ కొండపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చలి గాలులు మొదలయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గుండెను కొంచెం పదిలంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గే కొద్ది రక్త సరఫరా తగ్గిపోవడంతో గుండె జబ్బులు, నరాలకు సంబంధించిన జబ్బులు పెరిగే అవకాశం ఉంటుంది. చలిలో ఎక్కువగా తిరగడం వలన గుండె రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నవారికి, కొలెస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారికి, అధిక బరువు ఉన్న వారికి గుండె సరఫరా చేసే నాళాల్లో పగుళ్లు ఏర్పడి గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కొన్నిసార్లు అతి చలితో ఇన్ఫెక్షన్ ఏర్పడి గుండెకు పెనుముప్పు వాటిల్లే అవకాశం కూడా ఉంటుంది. చల్లని వాతావరణంలో ఆరోగ్యంగా ఉండటం కోరోనరీ ఆర్టరీ డిసీజ్ (సీఏడీ) ఉన్న వారిలో గుండె కండరాలకు తగినంత ఆక్సిజన్ అందకపోతే చల్లని ఉష్ణోగ్రతలు కార్డియాక్ ఇష్కీమియాను ప్రేరేపించి గుండె జబ్బులకు దారితీస్తాయి. చల్లని ఉష్ణోగ్రతలు రక్తనాళాలను కుంచించుకుపోయేలా చేయడంతో గుండెకు సరఫరా అయ్యే రక్తంలో సమస్యలు ఏర్పడతాయి. రక్తపోటు పెరిగి ఇరుకైన రక్తనాళాల ద్వారా రక్తాన్ని పంప్ చేయడానికి గుండె కష్టపడాల్సిన ఆవశ్యకత ఏర్పడి రక్తనాళాల సమస్య ఏర్పడుతుందని చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చల్లని వాతావరణంలో బయటికి వెళ్తే.. వెచ్చని దుస్తులు ధరించాలి. తలకు, చేతులకు సాక్స్‌ల లాంటివి ధరించాలి.
- తెల్లవారుజామున మంచు కురిసే సమయంలో అతి చలిగా ఉన్నప్పుడు వాకింగ్ చేయడం కూడా అంతగా మంచిది కాదు.
- అతిగా మద్యం సేవించకుండా పరిమితం చేసుకోవాలి. ముఖ్యంగా గుండె జబ్బులు ఇంతకుముందే ఉన్న వ్యక్తులు చల్లని వాతావరణానికి చాలా జాగ్రత్తగా ఉండాలి.
- మధుమేహం, ఆస్తమా, అధిక బరువు ఉన్న వారు అతి చలిలో వాకింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- చలికాలంలో మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలి. ఊపిరితిత్తుల, కిడ్నీ బాధితులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది.
- చల్లటి ప్రదేశంలో పడుకోకుండా గోరువెచ్చటి నీటితో స్నానం చేసి వెచ్చగా ఉండేలా చూసుకోవాలి.
- రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారు చలికాలంలో జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది, అలాంటివారు పౌష్టికాహారం తీసుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

పిల్లలు, వృద్ధులు వేడి దుస్తులు ధరించాలి

చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా వేడిగా ఉండే దుస్తులు ధరించాలి. చలికాలంలో ఎక్కువగా చర్మ సమస్యలు వేధిస్తుంటాయి. చర్మం పొడిబారుతుంది. పెదాలు తడి ఆరుతాయి. పగులుతాయి. చర్మంపై దురద దద్దుర్లు వస్తుంటాయి. మంచి నాణ్యతగల లోషన్‌లను వాడాలి. కొబ్బరి నూనెను పెదాలకు చర్మానికి రాసుకోవాలి. జ్వరం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ అమిరిశెట్టి భాస్కర్, లోహిత్ సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, సిద్దిపేట

జాగ్రత్తలు తీసుకోవాలి



తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల గుండెను ఆరోగ్యంగా కాపాడుకోవడంతో పాటు గుండెపోటు మరణాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంటుంది. కార్డియాక్ ప్రాబ్లం ఉన్నవారు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి. కొలెస్ట్రాల్, ఈసీజీ టుడీ ఈకో వంటి పరీక్షలు చేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మరి అవసరమైతే తప్ప గుండె జబ్బులు ఉన్న వ్యక్తులు ఉదయం, సాయంత్రం సమయాల్లో బయటికి రాకూడదు. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయంలో రక్తనాళాలు సంకోచ, వ్యాకోచాలకు గురవుతాయి. అందువల్ల తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉన్నప్పుడు వాకింగ్ చేయకూడదు. స్మోకింగ్, మద్యద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి.

- డాక్టర్ ఆనంద్ రాజ్, కార్డియాలజిస్ట్, మెడికేర్ రిచ్ హాస్పిటల్, సిద్దిపేట

గిరిజన హాస్టల్ తనిఖీ


వసతి గృహంలో స్టాక్ ను పరిశీలిస్తున్న గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ

శివ్వంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చలికాలం దృష్ట్యా విద్యార్థులకు స్నానాలకు వేడి నీళ్ల సదుపాయం కల్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి నీలిమ మాట్లాడుతూ ఉదయం చలి నీళ్లతో స్నానం చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు తన దృష్టికి తీసుకురావడంతో చలికాలం మొత్తం విద్యార్థులకు స్నానాలకు వేడి నీళ్ల సదుపాయం కల్పించాలని వార్డెన్ యాదయ్యను ఆదేశించినట్టు చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు.

'ఓస్లా కోగిఫర్'లో నూతన ఒప్పందం

జిన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓస్లా కోగిఫర్ టర్న్ఓట్ పరిశ్రమలో కార్మికులకు 11,900 రూపాయల నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేసేందుకు గురువారం యాజమాన్యం, కార్మికుల మధ్య ఒప్పందం కుదిరింది. జిల్లా పరిశ్రమ శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు, నాయకులు ఒప్పంద పత్రాలను అందజేశారు.

ఆదమరిస్తే అంతే..

- జహీరాబాద్ నియోజకవర్గంలో శిథిలావస్థలో కల్వర్టులు
- మూలమలుపుల వద్ద సైడ్‌వాల్స్ లేక ప్రమాదకరంగా మారిన వైనం
- కనీసం ప్రమాద సూచికలూ లేవు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


డౌన్‌టౌన్ వద్ద నుండి భరత్‌నగర్‌కు వెళ్లేరోడ్డుపై కల్వర్టుల వద్ద ఇరువైపులా సైడ్ వాల్స్ లేని దృశ్యం

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం, పాలకులకు పట్టింపు లేకపోవడం వెరసి ప్రయాణికులకు ప్రమాదాలు తప్పడం లేదు. అల్గోల్ చౌరస్త(డౌన్‌టౌన్) వద్ద గల జాతీయ రహదారి నుంచి ప్రతినిత్యం అల్గోల్, పోట్టిపల్లి, ఎల్గోయి, బీదర్‌చౌరస్తా తదితర ప్రాంతాలకు ఈ రోడ్డు గుండానే వివిధరకాల వాహనాలు వందల సంఖ్యలో వెళ్తుంటాయి. ముఖ్యంగా బ్రిడ్జి వద్దకు వెళ్లేవరకు అక్కడ బ్రిడ్జి ఉన్నదనే విషయం ఎవ్వరికి తెలియదు. బ్రిడ్జిదగ్గరకు వెళ్లి చుట్టుపక్కల పరిసరాలను గమనిస్తేనే బ్రిడ్జి ఉందనే అవగాహన వస్తుంది. రాత్రివేళ ఈ దారి గుండా ప్రయాణం ప్రమాదకరంగా ఉందని, అత్యవసర సమయాల్లో అతివేగంగా వెళ్తే ఈ బ్రిడ్జి వద్ద ప్రమాదం తప్పదని వాహనదారులు, స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదారిపై కొత్తగా వెళ్లే వ్యక్తులు వాహనాలతో వచ్చి ఈ బ్రిడ్జిని గమనించక వాగులోపడి గాయాలైన సందర్భాలు కోకొల్లలు. బ్రిడ్జి వద్ద సైడ్‌వాల్స్, ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

అల్గోల్ చౌరస్త(డౌన్‌టౌన్)వద్ద నుంచి భరత్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా గల రోడ్డు సింగిల్ రోడ్డులో ఓవైపు మూలమలుపు, మరో వైపు బ్రిడ్జికి సైడ్‌వాల్స్ అసలే లేవు. మరోవైపు అధ్వానంగా మారిన రోడ్డు ఉంది. తీవ్రస్థాయిలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నప్పటికీ సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాద హెచ్చరికలను సూచించే బోర్డులు ఏర్పాటుచేయకపోవడం గమనార్హం. కనీసం బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌వాల్స్‌ను నిర్మించాలని, మూలమలుపు వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలనే ఆలోచన అధికారుల్లో లేకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతుంది.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి

ఇంతే కాకుండా నియోజకవర్గంలోని దనసిరి-మాడ్గి రోడ్డుపై బ్రిడ్జి పూర్తిగా పాడైంది. చాల్కి-చీకూర్తి రోడ్డుపై, మెటల్‌కుంట-శంషొద్దిన్‌పూర్ రోడ్డుపై, ఇలా పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. భారీఎత్తున ప్రమాద ఘటనలు జరిగితే గానీ అధికారులు స్పందించరా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన బ్రిడ్జిల వద్ద మరమ్మతులు చేపట్టి వాహనదారులను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జిలకు త్వరలో మరమ్మతులు

నియోజకవర్గంలోని పలుప్రాంతాల్లో ప్రమాదకర ఉన్న బ్రిడ్జిలను గుర్తించాం. ఆయా బ్రిడ్జిల వద్ద మరమ్మతులు చేపట్టే దిశగా చర్యలు చేపడుతున్నాం. దనసిరి-మాడ్గి రోడ్డుపై పాడైన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం, డౌన్‌టౌన్ వద్ద నుంచి భరత్ నగర్‌కు వెళ్లేరోడ్డుపై బ్రిడ్జికి ఇరువైపుల సైడ్ వాల్స్‌లను నిర్మించాలనే ఆలోచనలో ఉన్నాం. వివిధ ప్రాంతాల్లో గల బ్రిడ్జిలకు మరమ్మతులు చేపటాల్లనే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో వాటన్నింటికి మరమ్మతులు చేపడుతాం.

\- బి. సంధ్య, ఆర్అండ్‌బీ ఏఈ

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చిన్నశంకరంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాయిని యాదమ్మ ఓ పరిశ్రమలో కూలీగా చేస్తుంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌కు గురై ఇల్లు, సామగ్రి దగ్ధమైంది. స్థానికులు మంటలు చల్లార్పినప్పటికీ రూ.45వేల నగదు, నిత్యావసర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది.

తారా కళాశాలలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా చరిత్ర విభాగం, యువటూరిజం క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫొటోగ్రఫీ, పెయింటింగ్స్ కాంపిటేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి విభాగమైన యునెస్కో ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ సంపదను సంరక్షించాలనే ఉద్దేశంతో ఈ నెల 25వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి డా.వాణి, యువ టూరిజం క్లబ్ కన్వీనర్ డా.సదయకుమార్, అధికారులు జగదీశ్వర్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం


గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీవో) సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డా.డి. వైద్యనాథ్, సెక్రటరీగా డా.ఎస్. సంతోష్ కుమార్, కోశాధికారిగా ఏవీజీకే ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా బలరామ్, ఉపాధ్యక్షులుగా పర్వతాలు, జితేందర్‌రెడ్డి, శ్రీవాణి, జాయింట్ సెక్రటరీలుగా రాజారెడ్డి, నజీర్‌పాషా, హేమలత, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శిరీష, పబ్లిక్ సెక్రటరీగా సురేశ్, ఆఫీస్ సెక్రటరీగా కృష్ణమోహన్, కల్చరల్ సెక్రెటరీగా తుకారాం, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రెటరీగా వెంకటేశం, కార్యవర్గసభ్యులుగా హరికిషన్, అంజ్య, యామిని, క్రిష్ణవేణి తదితరులు ఎన్నికయ్యారు.

సమగ్ర సర్వేలో తప్పులు లేకుండా చూడాలి


కుటుంబ సర్వే సమాచారం డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, మెదక్ కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

జిన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు వివరాలు సేకరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. గురువారం జిన్నారంలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్న కలెక్టర్ సర్వేపై అనవసర అపోహలు పెట్టుకోకుండా ప్రజలు సర్వేకు సహకరించాలని సూచించారు. సర్వేలో తీసుకునే వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. సూపర్‌వైజర్లు, అధికారులు ఖచ్చితత్వంతో కూడిన సర్వే జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో అరుణ, ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, సర్వేయర్ రామభద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా జిన్నారం మండలకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, ఆయా రైతులకు 48గంటలలోగా డబ్బులు అందేలా చూడాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ధాన్యం సేకరణ రిజిస్టర్లను పరిశీలించారు.

పక్కాగా నమోదు చేయాలి

మెదక్ అర్బన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఫారంలోని వివరాలు అతి ముఖ్యమైనవి అని, డేటా ఎంట్రీ పక్కాగా నమోదు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో మండల అభివృద్ధి అధికారులు, ప్రత్యేకాధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు సర్వే ఎంట్రీపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేలో సేకరించిన వివరాలను చిన్న పొరపాట్లకు కూడా తావులేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వే 91.31శాతం పూర్తి యిందన్నారు.

జిల్లాలో డేటా ఎంట్రీ కోసం 516 మంది ఆపరేటర్లను నియమించామన్నారు. 20 మంది ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, 4 ఎంపీఎస్‌వోలు, 19 ఈ డేటా ఎంట్రీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, సీపీవో బద్రీనాథ్, ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్ ఆదర్శనగర్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

జహీరాబాద్‌లో స్పీకర్‌కు ఘన స్వాగతం

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ గురువారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జహీరాబాద్‌కు రావడంతో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా పట్టణంలోని పలు ప్రైవేటు కార్యక్రమాల్లో స్పీకర్ పాల్గొన్న అనంతరం ఆదర్శనగర్‌లో గల సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో కాసేపు కార్యకర్తలతో ముచ్చటించారు. స్పీకర్‌కు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు.

లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కోర్టుల ఆధ్వర్యంలో నిర్వహించే లోక్‌అదాలత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.సూరిక్రిష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన కోర్టు ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ల వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాజీమార్గం ద్వార కేసులను పరిష్కారం చేసుకోవాలన్నారు. దీంతో కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. డిసెంబర్ 14న నిర్వహించే జాతీయలోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

ఝరాసంగం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కఠినచర్యలు తీకుంటామని శిశుసంక్షేమశాఖ జిల్లా అధికారి లలితకుమారి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలను ఎవరైన వేధిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగ బాలికలను ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే 181, 1098 నెంబర్‌లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పలు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్టు యాదగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


సంగారెడ్డి జిల్లా గ్రంథాలయంలో విజేతలను సన్మానించి జ్ఞాపికలను అందజేసిన పాలకవర్గం

సంగారెడ్డి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి.. ఈ వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు విద్యార్థులకు వివిధ కళలపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన 60 మందికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కార్యదర్శి వసుంధర సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ గ్రంధపాలకులు శ్రీనివాస్, ప్రశాంత్‌కుమార్, శోభారాణి, సిబ్బంది వరలక్ష్మి, సావిత్రి, మంజుల, కృష్ణమూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాల్లో చెకుముకి టాలెంట్ టెస్టులు


చేగుంట: టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

చేగుంట/వెల్దుర్తి/చిలప్‌చెడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేగుంట, వెల్దుర్తి, చిలప్‌చెడ్ మండలాల్లో విద్యార్థులకు గురువారం మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. విజేతలకు నవంబరు 28న జిల్లా స్థాయిలో చెకుముకి టాలెంట్ పరీక్షల పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చేగుంటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన టెస్ట్‌లో 14 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాల, అదర్శ పాఠశాల, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు ఎంఈవో నీరజ బహుమతులు అందజేశారు. వెల్దుర్తి మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో వెల్దుర్తి ఉన్నత పాఠశాల నుంచి ఇంగ్లీష్ మీడియం, మంగళపర్తి ఉన్నత పాఠశాల నుంచి తెలుగు మీడియం విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్టు ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. అదేవిధంగా చిలప్‌చెడ్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మాధ్యమంలో ఫైజాబాద్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో, గౌతాపూర్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో, సోమక్కపేట ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి అదేవిధంగా ఆంగ్ల మాధ్యమంలో ఫైజాబాద్ ఉన్నత పాఠశాల, చండూరు ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో, టౌతాపూర్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానాల్లో నిలిచాయని కాంప్లెక్స్ హెచ్ఎం వేదశ్రీ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు.

చిట్కుల్‌లో ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై ధర్నా


ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న మహిళలు

చిలప్‌చెడ్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా గ్రామంలో నీరు రావడంలేదని అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని నిరసిస్తూ గురువారం మండలం పరిధిలోని చిట్కుల్ ప్రధాన రహదారిపె మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. మండల పరిధిలోని భద్య్ర తండాలో గత మూడు నెలలుగా తాగునీరు సరిగా రావడం లేదని, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ధర్నా చేపట్టారు. 20 రోజులుగా నీటి ఎద్దడి తీవ్రంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య తీరే వరకు ఇక్కడినుంచి కదిలేది లేదని జోగిపేట-మెదక్ ప్రధాన రహదారిపై బైటాయించి ధర్నా చేశారు. దీంతో అరగంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు కల్పించుకుని వారికి సర్దిచెప్పారు. ఏఈతో మాట్లాడి వారికి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు.

జలాశయాలను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్

కల్హేర్/కంగ్టి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి);సిర్గాపూర్ మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామ శివారులోని ఉజలంపాడ్ ప్రాజెక్టును నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ కె, ధర్మా, సంగారెడ్డి జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ బి.ఏసయ్యలు గురువారం పరిశీలించారు. అదేవిధంగా కంగ్టి మండల పరిధిలోని సుక్కల్ తీర్థ్ గ్రామశివారులో నూతనంగా నిర్మిస్తున్న కొత్త చెరువును పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. కాగా ఉజలంపాడ్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోగా వస్తున్న వరద, అలుగు, ప్రాజెక్టు కట్ట, నీటి సామర్థ్యాన్ని వారు పరిశీలించారు. ప్రాజెక్టుకు చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వారి వెంట ఈఈ సురేందర్, డీఈఈలు బి.పవన్‌కుమార్, డి. విజయ్‌భాస్కర్, ఏఈఈ రవిందర్ ఉన్నారు.

'విద్యార్థులకు మెరుగైన విద్య నందించాలి'

మనోహరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్, జీడిపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ గురువారం తనిఖీ చేశారు. మనోహరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10 తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టార్‌ను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

తోటి ఉద్యోగి కుటుంబానికి చేయూత

మనోహరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న రికార్డ్ అసిస్టెంట్ సురేష్(31) రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. తోటి ఉద్యోగి కుటుంబానికి తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, కార్యాలయం సిబ్బంది తమ వంతుగా రూ.56 వేల ఆర్థికసాయాన్ని తహసీల్దార్ చేతుల మీదుగా అందజేసి ఉదారతను చాటుకున్నారు.

చేప పిల్లల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి


హత్నూర పెద్ద చెరువులో చేప పిల్లను వదులుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర/శివ్వంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటల్లో వదులుతున్న చేప పిల్లలతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని హత్నూర పెద్ద చెరువు, శివ్వంపేట మండలం గోమారం గ్రామ పెద్ద చెరువులో బిజిలిపూర్ వీరప్ప చెరువులో చేప పిల్లలను వదిలారు. శివ్వంపేట మండలంలోని చెరువుల్లో చేపపిల్లలను వదిలేందుకు ముందు గంగాహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హత్నూరలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి నర్సింగ్‌రావు, రాష్ట్ర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, రమణగౌడ్, హన్మంత్‌రెడ్డి, గంగపుత్ర అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలతో భూసారం పెంపు: ఏడీఏ


కల్హేర్: మార్డి గ్రామ శివారులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

నారాయణఖేడ్/కల్హేర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరి కోతలు పూర్తి అవుతున్నందున రైతులు వరి అవశేషాలను భూసారానికి పర్యావరణానికి అనువుగా వినియోగించుకోవాలని స్థానిక ఏడీఏ నూతన కుమార్ సూచించారు. గురువారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ వరి కోతలు పూర్తి అవుతున్నందున, అనేక మంది రైతులు వాటిని తగలబెడుతుండడం వల్ల, ఎందుకు ఉపయోగపడకుండా పోతున్నాయన్నారు. వరి కొయ్యలను నేలలో కలపడం వల్ల సహజసిద్ధంగా సేంద్రియ ఎరువుగా భూసారాన్ని పెంచుతాయన్నారు. కల్హేర్ మండల పరిధిలోని మార్డి, క్రిష్టాపూర్, కల్హేర్ గ్రామాల్లోని రైతులకు వరి కొయ్యలు కాల్చడం వలన కలిగే అనర్థాలపై రైతులకు ఏడీఏ అవగాహన కల్పించారు.అనంతరం క్రిష్టాపూర్, కల్హేర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏడీఏ పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓలు ప్రతిభ, సంతోష, క్రిష్ణవేణి ఉన్నారు.

వరి విత్తనాల ఎంపికపై అవగాహన


శివ్వంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలోని గురువారం రైతులకు రబీ కాలంలో అధిక దిగుబడులకు అనుకూలమైన కొన్ని సన్న మరియు దొడ్డు రకం వరి విత్తనాలను ఎంపిక చేసుకునే విధానం పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం తునికి సైంటిస్ట్ శ్రీనివాస్ సహకారంతో, రైతులకు సాంకేతిక సలహాలు అందించారు. మల్లారెడ్డి యూనివర్సిటీ (బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్) విద్యార్థులు వరి విత్తనాలు ఎంపిక చేసుకునే కీలకమైన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందుతున్న, మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు స్నేహ, శృతి, శిరీష,శైలజ,సింధు ఉన్నారు.

అబ్బురపరిచేలా..

(5వ పేజీ తరువాయి)

ఎగ్జిబిట్లను కలెక్టర్ ఆసక్తిగా తిలకించి వాటి పనితీరు, అందులో ఉన్న సారాంశాన్ని తెలుసుకున్నారు. డీఈవో ఎస్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, మాజీ సైన్స్ అధికారి విజయ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ లింబాజి, మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనిత, సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సోలోమాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, మీడియా కన్వీనర్ జాకీర్ హుస్సెన్, రఘు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

'సంజీవని' హెలికాప్టర్


గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ప్రణీత్‌తో గైడ్ టీచర్ పి.శోభారాణి

వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ కూలి భారత మొదటి సీడీఎస్ జనరల్ బిపిన్‌రావత్‌తో పాటు 14 మంది జవాన్లు వీరమరణం పొందిన సంఘటనవంటివి పునరావృతం కాకుండా ఉండేలా ఈ ప్రాజెక్టు రూపొందించారు. కారు ప్రమాదం జరిగిన వెంటనే అందులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకొని కారులోని వ్యక్తులను ఏవిధంగా ప్రమాదం నుంచి కాపాడుతాయో, అదే విధంగా హెలికాప్టర్ ప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికులు కూర్చునే సీటు చుట్టూ కవచం తెరుచుకుని కాపాడుతుంది. ఈ కవచం బులెట్‌ప్రూఫ్, ఫైర్‌ప్రూఫ్‌తో చేయబడి ఉంటుంది. అత్యవసర పరిస్థితిలో సీటు కింద ఉన్న బటన్ నొక్కగానే సీటు కింద ఉన్న అత్యవసర ద్వారం తెరుచుకొని కవచం ప్యారాష్యూట్‌తో సాహా ఆటోమెటిక్‌గా అది కిందికి పడిపోతుంది. ఈ కవచానికి ఆక్సిజన్, జీపీఎస్ సిస్టమ్, ప్యారాష్యూట్ సదుపాయం ఉంటుంది. హెలికాప్టర్ ప్రమాదవశాత్తు అడవిలో, సముద్రాలలో పడిపోయిన వ్యక్తి ఎక్కడున్నారో జీపీఎస్ సిస్టమ్ ద్వారా కనుక్కోవచ్చు. ఇటువంటి సదుపాయం భారతదేశ హెలికాప్టర్‌లో లేదు. ఈ విధానం ప్రస్తుత హెలికాప్టర్‌లో అమర్చితే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాల నుంచి రక్షించుకునేలా 'సంజీవని'లా హెలికాప్టర్ పనిచేస్తుంది.

విద్యార్థులు మూఢనమ్మకాలను వీడాలి


కేజీబీవీలో మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం,నవంబరు 21.(ఆంధ్రజ్యోతి): బాల్యం దశలోనే విద్యార్థులు మూఢనమ్మకాలను వీడాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, సైంటిఫిక్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అన్నారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి నేతృత్వంలో గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం- సైన్స్- మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, బాల్యవివాహాలతో వచ్చే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో భరోసా కేంద్రం అధికారులు శ్రీలత, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్య గ్రామీణ అంచనతో సమస్యల గుర్తింపు

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల స్థితిగతులపై అందరికి అవగాహన అత్యవసరమని కేవీకే శాస్త్రవేత్తలు డా. సాయిప్రియాంక, డా.స్వామి, డా. కైలాష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో నెలకొన్న వివిధరకాల అంశాలకు సంబంధించి భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన 60మంది విద్యార్థులు ప్రాక్టికల్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో అవగాహన నిమిత్తం వచ్చినట్టు తెలిపారు. ఒక్కోగ్రామానికి 10మంది విద్యార్థుల చొప్పున ఆయా గ్రామాల్లో మూడునెలల పాటు ఉంటారన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థల పరిశీలన

వట్‌పల్లి, నవంబరు 21.(ఆంధ్రజ్యోతి): మండలంలో అరకొర వసతులతో కొనసాగుతున్నపలు ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాల నిర్మాణం కోసం గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శాంబిరెడ్డి తదితరులు స్థలాన్ని పరిశీలించారు. మంత్రి దామోదర్ ఆదేశం మేరకు మండలంలోని గౌరైకల్‌లోని సర్వేనంబరు 11లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు.